సాక్షి నిజామాబాద్

బుధవారం । 2 । ఆగస్టు । 2023



జాగ్రత్తలు పాటించాలి

కళ్ల కలక ప్రమాదకరమైనది కాదని జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని తెయూ రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొన్నారు.

- 8లో ▸



యథేచ్ఛగా ఇటుక బట్టీలు

బస్సాపూర్ గ్రామ శివారులోని ఎస్సారెస్పీ భూముల్లో యథేచ్ఛగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.2 /23.5

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చలి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం మేఘావృతం కావచ్చు. సాయంత్రం తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఐటీ హబ్‌లో సదుపాయాలు భేష్



నిజామాబాద్‌నాగారం : ఎమ్మెల్సీ కవిత ఆహ్వానం మేరకు మంగళవారం గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాలతో కలిసి జిల్లా కేంద్రంలో ఉన్న ఐటీ హబ్‌ను గ్లోబల్ లాజిక్ కంపెనీ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ ఉన్న సదుపాయాలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. తమ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 13 దేశాల్లో సంస్థ విస్తరించిందని ప్రతినిధులు పేర్కొన్నారు. మన దేశంలో 30,000 మంది ఈ సంస్థలో పనిచేస్తుండగా ఒక్క హైదరాబాద్‌లో 3000 మంది పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ప్రతినిధులు శ్రీనాథ్ రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుల ప్రక్రియపై జూమ్ మీటింగ్

నిజామాబాద్ అర్బన్ : ఇన్‌స్పైర్ అవార్డ్స్ నామినేషన్ ప్రక్రియపై నేడు సమావేశం నిర్వహిస్తున్నట్లు డీఈవో దుర్గప్రసాద్ తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ నుంచి నిజామాబాద్ జిల్లాలోని అప్పర్ ప్రైమరీ, హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులకు, మాథ్స్, సైన్స్ ఉపాధ్యాయులకు ఈ కార్యక్రమాన్ని జూమ్ ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు.

నూత్‌పల్లి బీసీ గురుకులంలో 'కళ్ల కలక'

ఐసోలేషన్‌లో విద్యార్థులు



డొంకేశ్వర్(ఆర్మూర్) : డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లి బీసీ గురుకుల పాఠశాలలో కళ్ల కలక వ్యాప్తి చెందింది. ఒకరి నుంచి ఒకరికి వ్యాధి సోకడంతో దాదాపు 50 మంది విద్యార్థులను ప్రత్యేక గదిలో ఐసోలేషన్ చేశారు. వీరికి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. వ్యాధి తగ్గుముఖం పట్టిన తర్వాత విద్యార్థులను తరగతి గదుల్లోకి పంపనున్నారు. అయితే, తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పాఠశాల సిబ్బంది స్పష్టం చేశారు.

నిజాంసాగర్‌లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల మంజీర నది ద్వారా మంగళవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 8 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు రెండు వరద గేట్ల ద్వారా అంతే నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగుల(17.8 టీఎంసీలు)తో నిండుకుండలా ఉంది.

నేటి నుంచి టెట్‌కు దరఖాస్తులు

నిజామాబాద్‌అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం మరోసారి టెట్ నిర్వాహణ కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. నేటి నుంచి ఆన్‌లైన్ ద్వారా టెట్‌కు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. అనంతరం సెప్టెంబర్ 19 తేదీన టెట్ పరీక్ష నిర్వహిస్తారు. సెప్టెంబర్ 9న హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాల్సి ఉంటుందని డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. సెప్టెంబర్ 27న ఫలితాలను వెల్లడించనున్నారు. ఎప్పటిలాగే మొదటి, రెండవ పేపర్ల నిర్వహణ ఉంటుందని డీఈవో తెలిపారు.

ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్లకు గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్ : అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ అడ్మిషన్ల గడువు పెంచినట్లు కళాశాల కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీ వరకు అడ్మిషన్లు పొందవచ్చన్నారు. అలాగే డిగ్రీ ద్వితీయ, పీజీ సెకండియర్ విద్యార్థులు విద్యార్థులు రెన్యూవల్ చేసుకోవడానికి కూడా ఈనెల 16వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. వివరాలకు 738 292 9612 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నష్టాల మేటలు

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఉప్పొంగిన చెరువులు, వాగులు కర్షకులకు కన్నీళ్లు పెట్టించాయి. అధిక వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పుడిప్పుడే వేసిన నాట్లు ఇసుకలో కూరుకుపోగా, కొన్నిచోట్ల కొట్టుకుపోయాయి. ఒక్కో ఎకరానికి రూ. 50వేలకు పైగా నష్టం ఏర్పడింది. పరిహారం విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూలత లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు.



వాగు అనుకునేరు..పొలమే ఇది : పాలెంలో వర్షాలతో పొలంలో వేసిన ఇసుక మేటలు

- ఒక్కో ఎకరానికి రూ. 50 వేలకు మించి నష్టం
- వర్షాలతో పొలాల్లో భారీగా ఇసుక మేటలు
- పెట్టుబడులు కోల్పోయిన అన్నదాత
- పొలాలు బాగుచేసేందుకు రైతులకు అదనపు భారం
- పరిహారం ఊసెత్తని సర్కారు

మోర్తాడ్(బాల్కొండ) : నాలుగైదు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురువడం నీరు ఉప్పొంగి పంట పొలాలను ముంచేసిన విషయం విదితమే. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు దాదాపు 30 వేల ఎకరాల్లో ఇసుక మేటలు వేసిందని అంచనా. వ్యవసాయశాఖ ఇంకా ప్రాథమిక అంచనా ప్రకారం భారీగానే పంట పొలాలకు నష్టం వాటిల్లిందని తెలుస్తోంది. ఇసుక మేటలు వేయడంతో పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడిని రైతులు పూర్తిగా కోల్పోయారు. వరి, సోయా, మొక్కజొన్న, పసుపు పంటల సాగును ఆరంభించగా అన్ని రకాల పంటలు నీట మునిగిపోయాయి. పెట్టుబడులు కోల్పోవడంతో పాటు ఇసుక మేటలు వేయడంతో పొలాల్లో సాగుకు విఘాతం ఏర్పడింది. ఇసుకను తొలగించి సాగుకు అనుకూలంగా మార్చాలంటే ఒక్కో ఎకరానికి రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. పెట్టిన పెట్టుబడితో మొత్తంగా రూ. 50వేల వరకు నష్టం ఏర్పడిందని రైతులు పేర్కొంటున్నారు. ఇసుకను తొలగించినా ఒక ఏడాది పాటు పంటల దిగుబడి ఆశించిన విధంగా ఉండదని రైతులు తెలిపారు. పెట్టుబడులు నష్టపోవడం, ఇప్పుడు అభివృద్ధి కోసం ఖర్చు మొత్తం తమకు తలకు మించిన భారమవుతుందని రైతులు వాపోతున్నారు.

నష్టం అంచనా రూ. 150 కోట్లకు పైగానే..

ఇసుక మేటలు వేయడంతో జిల్లా రైతాంగానికి భారీగానే నష్టం ఏర్పడిందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. ఒక్కో ఎకరానికి రూ. 50 వేల చొప్పున నష్టం వాటిల్లడాన్ని అంచనా వేస్తే 30 వేల ఎకరాలకు రూ. 150 కోట్లకు మించి నష్టం ఏర్పడిందని స్పష్టమవుతోంది. ప్రభుత్వం గతంలో ప్రకటించిన విధంగా ఎకరానికి రూ. 10 వేల సాయం అందించినా కొంతైనా ఊరట లభిస్తుందని రైతులు చెబుతున్నారు.

కొంపముంచిన చెక్‌డ్యాంలు..

చెక్‌డ్యాంల వల్ల నష్టపోయిన పంటలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. చెక్‌డ్యాంల నిర్మాణం లోపభూయిష్టంగా ఉండటంతో పెద్దవాగు పరిసరాల రైతులకు పెనుముప్పు పొంచి ఉంది. ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలకు పరిహారాన్ని మంజూరు చేసిన ప్రభుత్వం ఇసుక మేటలు వేయడంతో నష్టపోయిన పంటలకు పరిహారం ఎందుకు ప్రకటించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

పరిహారం ఇవ్వాలి



ఇసుక మేటలు వేసిన పంట పొలాలకు సంబంధించి రైతులకు పరిహారం మంజూరు చేయాలి. బాధిత రైతులు అనేకమంది ఉన్నారు. ఇసుక మేటలు వేసిన పొలాల్లో పంటల దిగుబడి పెరగాలంటే ఒక ఏడాదైనా ఓపిక పట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వం పరిహారం మంజూరు చేస్తే కొంతైనా ఆసరా అవుతుంది. – కుంట రవి శంకర్ రెడ్డి, రైతు, పాలెం

సాయం అందించాలి



భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం తప్పకుండా అందించాలి. గతంలోను ఎంతో మందికి సాయం అందించలేదు. ఇప్పుడైనా రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి. రైతుల పట్ల ప్రభుత్వం దయచూపి ఆదుకోవాల్సిన అవసరం ఉంది. – మాదాం ప్రణీత్, రైతు, తొర్తి

విలీనంపై ఆర్టీసీ ఉద్యోగుల సంబురాలు



సీఎం కేసీఆర్‌కు బొకే ఇస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్



బాజిరెడ్డితో ఎమ్మెల్యే షకీల్, దాదన్నగారి సందీప్‌కుమార్



మంత్రి ప్రశాంత్‌రెడ్డికి బొకే ఇస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

- నేడు ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డికి స్వాగతం పలకనున్న సంస్థ ఉద్యోగులు
- నిజామాబాద్ డిపోల్లో సంబురాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఆర్టీసీని ప్రభుత్వ పరం చేసేందుకు నిర్ణయించడంతో ఆ సంస్థ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మంగళవారం సీఎం కేసీఆర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. బాజిరెడ్డితో పాటు బోధన్ ఎమ్మెల్యే షకీల్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దాదన్నగారి సందీప్‌కుమార్ ఉన్నారు.

మంత్రికి అభినందనలు..

నిజామాబాద్‌నాగారం : ప్రభుత్వంలో టీఎస్ఆర్టీసీని విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్న శుభ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు.

ఆర్టీసీని బలోపేతం చేసేందుకే...

ఖలీల్‌వాడి : సీఎం కేసీఆర్ ఆర్టీసీని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో చర్చించి ఈ నిర్ణయంతీసుకున్నారని జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌మోహన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని న్యాల్‌కల్ రోడ్డులోని నిజామాబాద్-2 డిపోలో ఆర్టీసీ ఉద్యోగులు సీఎం కేసీఆర్, ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రివర్గ సమావేశంలో ఆర్టీసీ ఉద్యోగులకు డీఏ, హెచ్‌ఆర్‌ఏ ఇస్తారని భావించామని కాని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఆర్టీసీ డిపో-2 మేనేజర్ వెంకటేశ్వం, కండక్టర్లు, డ్రైవర్లు, శ్రామికులు తదితరులు ఉన్నారు. ఆర్టీ సీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన అనంతరం జిల్లాకు వస్తున్న ఆర్టీసీ చైర్మన్‌కు ఘనస్వాగతం పలకనున్నట్లు ఉద్యోగులు పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు రూరల్ క్యాంప్ ఆఫీస్‌లో సమావేశం ఉంటుందన్నారు. డిపో-1 లోనూ ఉద్యోగులు సంబురాలు జరిపారు.



సీఎం, ఆర్టీసీ చైర్మన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న జెడ్పీటీసీ జగన్‌మోహన్, ఆర్టీసీ సిబ్బంది

సీబీఆర్టీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవాలి
- సమన్వయ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి



డీఈవో దుర్గాప్రసాద్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

సుభాష్‌నగర్ : తెలంగాణ ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో బోధన, బోధనేతర ఖాళీల భర్తీ (టీజీటీ, పీజీటీ) కోసం నియామక మండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సీబీఆర్టీ) పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఈనెల 05 నుంచి 17వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయని యాదిరెడ్డి తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లా కేంద్రంలోని అర్సపల్లి వద్ద గల ఏవీ ఎంటర్ ప్రైజెస్ (నాలెడ్జి పార్క్ ఇంటర్నేషనల్ స్కూల్), ఆర్మూర్ మండలం చేపూర్ వద్ద గల క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజీలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. మూడు షిఫ్టులలో పరీక్షలు కొనసాగుతాయని, మూడు షిఫ్టుల్లో పరీక్ష ఉంటుందన్నారు. మొదటి షిఫ్ట్ పరీక్ష ఉదయం 8.30 నుంచే ప్రారంభమవుతుందని, నిర్ణీత సమయానికి గంటన్నర ముందుగానే అభ్యర్థులను లోనికి అనుమతిస్తామన్నారు. పరీక్ష సమయానికంటే 15 నిమిషాల ముందే కేంద్రాల గేట్లు మూసేస్తామన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తోపాటు తప్పనిసరిగా ఆధార్, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఫొటో ఆధారిత గుర్తింపు కార్డులో ఏదైనా ఒక గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని, సెల్‌ఫోన్, క్యాలిక్యులేటర్, స్మార్ట్ వాచ్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తేకూడదని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోని గదుల్లో తగినంత వెలుతురు, సరిపడా లైటింగ్, తాగునీరు, టాయిలెట్, తదితర వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేంద్రంలో ఏఎన్ఎంను నియమించాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, తగిన పోలీసు బందోబస్తుతో పాటు మహిళా పోలీసు సిబ్బంది ఉండేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహిస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్ కో ఎస్ఈ రవీందర్‌ను అదనపు కలెక్టర్ యాదిరెడ్డి సూచించారు. సమావేశంలో డీఈఓ దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

24 మంది ఇన్.. 22 మంది ఔట్..

- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ల బదిలీలు
- మల్టీజోన్-1 పరిధిలోని జిల్లాలకు స్థానచలనం
- తక్షణమే రిపోర్ట్ చేయాలని ఆదేశాలు



సుభాష్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్రం ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు జిల్లాలోని తహసీల్దార్లను బదిలీలు చేసి, పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు వెలువరించింది. మల్టీజోన్-1 పరిధిలోని ఆరు జిల్లాలకు 22 మంది తహసీల్దార్లు బదిలీ అయ్యారు. అదేవిధంగా మరో 24 మందిని అదే జోన్ పరిధిలోని మన జిల్లాకు అలాట్ అయ్యారు. బదిలీ అయిన తహసీల్దార్లు బుధవారమే ఆయా స్థానాల్లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలో 33 మంది తహసీల్దార్లు పనిచేస్తున్నారు. మాక్లూర్ తహసీల్దార్ శంకర్ మినహా మిగతా 32 మంది తహసీల్దార్లు మూడేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్నారు. ఇప్పటికే కలెక్టర్, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్, ఆర్డీఓల బదిలీల ప్రక్రియ పూర్తయ్యింది. తాజాగా తహసీల్దార్ల బదిలీలు చేపడుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. బదిలీపై వచ్చిన తహసీలార్లకు ఏయే మండలాలు కేటాయిస్తారనేది ఉదయం వరకు స్పష్టత వచ్చే అవకాశముందని కలెక్టరేట్ అధికారులు పేర్కొంటున్నారు.

నిజామాబాద్‌కు బదిలీపై వస్తున్న తహసీల్దార్లు

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లా
పి వెంకట్‌రమణ	నిర్మల్
జె అనిరుద్	నిర్మల్
ఎంఏ ఖలీం	నిర్మల్
శ్రీకాంత్ గుండ్లవార్	నిర్మల్
బి ప్రభాకర్	నిర్మల్
ఏ శ్రీధర్	నిర్మల్
డి సుజాత	జగిత్యాల
ఎం రాజేందర్	జగిత్యాల
బి రవీందర్‌రావు	జగిత్యాల
ఎండీ యూసుఫ్	జగిత్యాల
మహ్మమద్	
అబ్దుల్ మజీద్	రాజన్న సిరిసిల్ల
బి మధుసూదన్‌రెడ్డి	రాజన్న సిరిసిల్ల
కె రవికాంత్	రాజన్నసిరిసిల్ల
పి మునీందర్	రాజన్న సిరిసిల్ల
మహ్మమద్	
తఫాజుల్ హుస్సేన్	రాజన్న సిరిసిల్ల
ఎం నారాయణ	కామారెడ్డి
కె గంగాధర్	కామారెడ్డి
కె ధన్‌వాల్	కామారెడ్డి
పి ఆనంద్‌కుమార్	కామారెడ్డి
జె వెంకట్‌రావు	కామారెడ్డి
కె మోతిసింగ్	కామారెడ్డి
ఎస్ విజయానందం	మంచిర్యాల
ఎస్ వెంకటేశం	మెదక్
బి మాలతి	మెదక్

నిజామాబాద్ నుంచి బదిలీపై వెళ్తున్న తహసీల్దార్లు

పేరు	బదిలీపై వెళ్తున్న జిల్లా
జి రాజేందర్	కరీంనగర్
ముంతాజీబుద్దీన్	జగిత్యాల
ఎల్ వీర్‌సింగ్	జగిత్యాల
జి ప్రసాద్	జగిత్యాల
ఎం వసంత	జగిత్యాల
ఎ శేఖర్	జగిత్యాల
డి బావయ్య	జగిత్యాల
ఆర్ అనిల్‌కుమార్	సిద్దిపేట
సి జయంత్‌రెడ్డి	ఆదిలాబాద్
ఎల్ ప్రవీణ్‌కుమార్	నిర్మల్
ఎస్ శ్రీనివాస్	నిర్మల్
పి విజయ్‌కుమార్	నిర్మల్
బి రవి	నిర్మల్
కె మల్లేష్	నిర్మల్
ఎస్ గంగాసాగర్	కామారెడ్డి
టీవీ రోజా	కామారెడ్డి
వై సుదర్శన్	కామారెడి
ఎస్ లత	కామారెడి
యూ సురేష్	కామారెడి
డి శ్రీధర్	కామారెడ్డి
మహ్మమద్	
గఫార్ మియా	కామారెడ్డి
బి అనిల్‌కుమార్	ఆదిలాబాద్

కొత్త లిఫ్ట్‌లకు నిధులు మంజూరు

- ఆర్మూర్ పరిధిలో కొత్త ఆయకట్టుకు అందనున్న సాగునీరు
- శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ రివర్స్ పంపింగ్ నీళ్ల ఆధారంగా లిఫ్టుల నిర్మాణం
- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

ఆర్మూర్ : ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని రెండు కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ (ఎత్తిపోతల పథకాల) ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం కోసం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే కాకుండా రూ. 120.89 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి మంగళవారం తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని మచ్చర్ల, జోర్పూర్, కుద్వాన్‌పూర్, కంఠం, చిక్లి, గుంజిలి గ్రామాలకు నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందనుందన్నారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణాల ద్వారా 10 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందనుందన్నారు. మచ్చర్ల, జోర్పూర్, కుద్వాన్‌పూర్‌లో రూ. 40.50 కోట్లతో చేపట్టనున్న కొత్త లిఫ్ట్ నిర్మాణం ద్వారా సుమారు 5 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుందన్నారు. అలాగే కంఠం, చిక్లి, గుంజిలిలలో రూ. 80 కోట్ల 39 లక్షలతో నిర్మించే కొత్త లిఫ్ట్ ద్వా రా మరో 5 వేల ఎకరాల ఆయకట్టుకు లబ్ధి చే కూరుతుందన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ రివ ర్స్ పంపింగ్ ఆధారంగా లిఫ్ట్‌ల నిర్మాణం జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్ వల్ల ఇన్నాళ్లకు న్యాయం జరిగిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బినోల లిఫ్ట్‌కు రూ. 79 కోట్లు మంజూరు

నవీపేట : పెండింగ్‌లో ఉన్న బినోల లిఫ్ట్‌కు సీఎం కేసీఆర్ రూ. 79.89 కోట్లు మంజూరు చేసినట్లు బోధన్ ఎమ్మెల్యే షకీల్ మంగళవారం ఒక ప్రటటనలో తెలిపారు. నిజాంసాగర్ చివరి ఆయకట్టు ప్రాంతమైన బినోలా ప్రాంతం సస్యశ్యామలం కోసం గతంలో అధికారులు ప్రతిపాదనలు పంపారు. గోదావరి నది నుంచి నీటిని తోడి బినోలతో పాటు నందిపేట మండలంలోని కంఠం, కొత్తపల్లి మండలం చిక్లి తదితర ప్రాంతాల్లోని 700 ఎకరాలకు సాగునీరిచ్చేందుకు ఈ పథకం రూపకల్పనచేశారు. ఈ నిర్ణయంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతన్నలకు కేసీఆర్ గిఫ్ట్



ఆర్మూర్ నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన లిఫ్ట్‌లు అ న్నదాతలకు సీఎం ఇచ్చి న గిఫ్ట్. మా పెద్ద రైతు కేసీఆర్ రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది. నూతన లిఫ్ట్‌లు మంజూరు చేసి న సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు.

– ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే

క్లుప్తంగా

అడిషనల్ కంట్రోలర్‌గా నందిని నియామకం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అడిషనల్ కంట్రోలర్ (ఈడీపీ సెక్షన్)గా బీ నందిని నియామకమయ్యారు. తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి మంగళవారం నందినికి నియామక ఉత్తర్వులు అందజేశారు. గతంలో నందిని అసిస్టెంట్ కంట్రోలర్‌గా, ఉమెన్ సెల్ డైరెక్టర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామర్‌గా, గర్ల్స్ హాస్టల్ వార్డెన్‌గా, ఇన్ఫ్రాస్ట్రక్చర్ సెల్ డైరెక్టర్‌గా, సీబీటీ కోఆర్డినేటర్‌గా, కంప్యూటర్ సైన్స్ హెడ్, బీవోఎస్‌గా, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా అకడమిక్ పదవులను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం ఎల్ఎల్‌బీ 6వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు 24 మంది విద్యార్థులకు 23 మంది హాజరు కాగా ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఎల్ఎల్‌బీ 2వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షకు 34 మంది విద్యార్థులకు 27 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఎల్ఎల్ఎం 2వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 10 మంది విద్యార్థులకు ఒకరు గైర్హాజరైనట్లు తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ 4వ సెమిస్టర్, ఐఎంబీఏ, ఏపీఈ, పీసీహెచ్ 10వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 476 మంది విద్యార్థులకు 450 మంది పరీక్ష రాశారని కంట్రోలర్ అరుణ తెలిపారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని తెయూ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో తెయూ పరిపాలనా భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ వ్యవస్థ అనే పదాలు లేకుండా చేస్తానని, అందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తానని చెప్పిన మాటలను సీఎం కేసీఆర్ నిజం చేయాలని కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎల్‌బీరవికుమార్, అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, బికోజీ, నరేష్, రవీందర్, గణేష్, సాయి, శోభ, మౌనిక, మమత, అలేఖ్య, పద్మ, వకుల, మంజుల పాల్గొన్నారు.

నటేశ్వరశర్మకు సన్మానం



కామారెడ్డి క్రైం: దాశరథి పురస్కారం పొందిన కవి, అష్టావధాని ఆయాచితం నటేశ్వర శర్మను మంగళవారం కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. దాశరథి పురస్కారాన్ని పొందడం ద్వారా జిల్లా ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో ఇనుమడింపజేశారని నటేశ్వర శర్మను కొనియాడారు. శంకర్, మనోహర్‌రావు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇటుక బట్టీలు

- నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు



బాల్కొండ మండలం బస్సాపూర్ శివారులో ఎస్సారెస్పీ భూమిలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీ

బాల్కొండ: బాల్కొండ మండలం బస్సాపూర్ గ్రామ శివారులోని ఎస్సారెస్పీ భూముల్లో యథేచ్ఛగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఏడాది నుంచి బట్టీలు కొనసాగుతున్నాయి. ఇది వరకే ప్రాజెక్ట్ నుంచి వందల టిప్పర్ల మట్టిని తరలించి ఇటుక బట్టీల వద్ద డంపులు వేసిన అధికారులు పట్టించుకోలేదు. పర్యాటక అభివృద్ధిలో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌నిలిచే ప్రాంతం మీదుగా రోడ్డు ఏర్పాటు చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. ఆ సమయంలో ఇటుక బట్టీలను తొలిగించాలంటు హడావుడి చేశారు. తర్వాత ఇటుక బట్టీల వైపు కన్నెత్తి చూడటం లేదు. గతంలో ఇటుక బట్టీల నిర్వాహకుల వద్ద నుంచి అధికారులకు స్థాయిని బట్టీ ప్రతి నెల ముడుపులు అందుతున్నాయని ఇంటలిజెన్స్ అధికారులు నివేదికిచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వ భూముల్లో బట్టీల నిర్వహణ కోసం అధికారులకు మామూళ్లు ముట్టాయనే ఆరోపణాలున్నాయి. బట్టీ వద్ద షెడ్డు వేసుకోవడానికి రూ.20 వేలు ఓ అధికారికి ముట్ట జెప్పినట్లు నిర్వాహకులు బహిరంగంగానే చెపుతున్నారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వలోపం ఉండటం కూడా బట్టీల నిర్వాహకులకు వరమైందని చెప్పవచ్చు. వీరు చర్యలు తీసుకోవాలంటు వారు.. వారు చర్యలు తీసుకోవాలని వీరు చెప్పుకుంటు పోతున్నారు. దీంతోనే ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ ఆనకట్ట చుట్టు, బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం చుట్టు ఇటుక బట్టీలు వెలిశాయి. ఎస్సారెస్పీ అధికారులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతోతో నిలువరించాలి. కానీ ఇక్కడ అది జరగడం లేదు. ఉన్నత అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

తొలగించాలని సూచించాం

ఎస్సారెస్పీ బ్యాకు వాటర్ సమీపంలో ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలను తొలిగించాలని ఇది వరకే సూచించాం. ప్రాజెక్ట్ అధికారులకు కూడా తెలియజేశాం. తొలిగించకుంటే చర్యలు తీసుకుంటాం.

– వినోద్, తహసీల్దార్, బాల్కొండ

ఇచ్చినంత తీసుకోవాల్సిందే!

- స్కీం సభ్యులకు సగం డబ్బుల కోత
- ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్న నిర్వాహకులు

మోర్తాడ్: తమ అదృష్టాన్ని పరీక్షించుకోడానికి స్కీంలలో చేరిన సభ్యులను స్కీం నిర్వాహకులు నిండా ముంచుతున్నారు. సభ్యులు చెల్లించిన మొత్తంలో సగంకంటే ఎక్కువ సొమ్ముకు కోత విధిస్తున్నారు. ఏడాదిన్నర కాలం పాటు స్కీం డబ్బులు వాపసు ఇవ్వకుండా, బహుమతులు ఇవ్వకుండా వేధించిన నిర్వాహకులు ఇప్పుడు తాము ఎంత సొమ్ము ఇస్తే అంత తీసుకోవాలని లేదంటే ఏమి చేస్తారో చేసుకోవాలని సభ్యులపై జులుం చేస్తున్నారు. ఒక్కో స్కీం సభ్యుడు నెలకు రూ.1,500 చొప్పున 15 నెలల పాటు రూ.22,500 చెల్లించారు. స్కీం చివరి నెల వరకు ఎలాంటి బహుమతులు పొందని వారికి టీవీ, వాషింగ్ మిషన్, ఫ్రిజ్‌లలో ఏదో ఒకటి ఇస్తామని నిర్వాహకులు మొదట్లో చెప్పారు. 2020లో స్కీం ప్రారంభించగా 2021లో ముగిసిపోయింది. స్కీం కాలపరిమితి ముగిసిన వెంటనే సభ్యులకు బహుమతులు ఇవ్వకుండా సతాయించిన నిర్వాహకులు ఈ స్కాం బయటపడటంతో కేసులకు జంకి సభ్యుల చుట్టూ తిరుగుతున్నారు. రూ.22,500 చెల్లించిన వారికి రూ.10వేలు ఇస్తామని చెబుతున్నారు. మోర్తాడ్ మండలంలోని దొన్కల్, వేల్పూర్ మండలంలోని లక్కోరాలలో కొంత మంది సభ్యులు స్కీం సొమ్ము తక్కువ తీసుకోవడానికి నిరాకరించారు. తాము ఇచ్చినంత తీసుకోవాలని లేదంటే ఏమి చేస్తారో చేసుకోవాలని ఒకరిద్దరు నిర్వాహకులు సభ్యులను బెదిరిస్తున్నట్లు తెలుస్తుంది. తాము ఇచ్చే రూ.10వేలతో సరిపెట్టుకోవాలని లేదంటే నయాపైసా ఇవ్వమని హెచ్చరిస్తున్నారని సమాచారం. ఎక్కువ మొత్తంలో చెల్లించి ఏడాదిన్నర కాలం ఓపిక పట్టినందుకు నిర్వాహకులు సగంకంటే తక్కువ సొమ్ము చెల్లించడం ఎంత వరకు సబబు అని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. కనీసం రూ.18వేల వరకైనా వాపసు ఇవ్వాలని లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కొందరు సభ్యులు చెబుతున్నారు. స్కీం నిర్వాహకులు అధికార పార్టీ నాయకులు కావడంతో అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో అని ప్రజలు సందేహిస్తున్నారు.

కళ్ల కలక రాకుండా జాగ్రత్తలు పాటించాలి



విద్యార్థులకు ఐ డ్రాప్స్, ట్యాబ్లెట్లు అందజేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): కళ్ల కలక ప్రమాదకరమైన వ్యాధి కాదని సరైన జాగ్రత్తలు పాటిస్తే సులభంగా తగ్గిపోతోందని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం యాదగిరి అన్నారు. తెయూ క్యాంపస్‌లోని ఓల్డ్, న్యూ బాయ్స్ హాస్టల్స్‌లో పలువురు విద్యార్థులు కళ్ల కలక బారిన పడ్డారు. దీంతో క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌లో మంగళవారం మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. వానాకాలం సీజన్‌లో కళ్ల కలక సాధారణంగా వ్యాప్తి చెందుతుందన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అప్తమాలజిస్ట్ సుజాత, పల్మనాలజిస్ట్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. కళ్ల కలక వ్యాధి సోకిన వారు మాస్కులు, కళ్లద్దాలు విధిగా ధరించాలని సూచించారు. శిబిరంలో వంద మందికి పైగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఐ డ్రాప్స్, టాబ్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, అడ్మిషన్స్ డైరెక్టర్ సంపత్‌కుమార్, చీఫ్‌వార్డెన్ మహేందర్‌రెడ్డి, ఏఎన్ఎం సుజాత, ఎస్టేట్ ఆఫీసర్లు అశోక్‌వర్ధన్‌రెడ్డి, యాదగిరి, హాస్టల్ వార్డెన్ కిరణ్ రాథోడ్, కేర్ టేకర్స్ క్రాంతి, దిగంబర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ప్రారంభించిన ఏసీపీ



కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ

ఖలీల్‌వాడి: నగరంలోని మార్కండేయ మందిరం సమీపంలోని కోటమైసమ్మ గుడి వద్ద సీసీ కెమెరాలను ఏసీపీ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలను చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సిరిగాద ధర్మపురి, చింతకాయల రాజు, దేవారెడ్డి ఉన్నారు.

సమాజాన్ని కాపాడేది కళలు, సాహిత్యమే

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్



మాట్లాడుతున్న నలిమెల భాస్కర్

కామారెడ్డి అర్బన్: చదువుతోనే భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ అన్నారు. కళలు, సాహిత్యమే సమాజాన్ని కాపాడుతాయన్నారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం తెలుగుశాఖ ఆధ్వర్యంలో 'చదవు–జీవితం' అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో నలిమెల భాస్కర్ అతిథి ప్రసంగం చేశారు. తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ వి శంకర్ కార్యక్రమ సమన్వయం చేస్తు నలిమెల జీవిత విశేషాలను పరిచయం చేశారు. నలిమెల మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతికను అవసరం మేరకు వినియోగించుకోవాలని, కృతిమ మేధస్సుకు బానిస అయితే జీవితంలో పెద్ద తప్పిదం అవుతుందన్నారు. రేపటి సమాజాన్ని కాపాడేది కళలు, సాహిత్యమే అన్న నిజాన్ని గ్రహించాలన్నారు. ఆయన రూ.5వేల విలువైన పుస్తకాలను కళాశాల తెలుగుశాఖకు బహుకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె కిష్టయ్య మాట్లాడుతు.. గొప్ప రచయిత, బహుభాషా కోవిదుడు నలిమెల భాస్కర్ తమ కళాశాల పూర్వ విద్యార్థి కావడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. సిరిగాద శంకర్, పి రామకృష్ణ, టి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రావు, లక్ష్మణాచారి, కృష్ణమోహన్, రాములు, రాజ్‌గంభీర్‌రావు, జి చంద్రశేఖర్‌గౌడ్, శ్రీవేణి, లక్ష్మణ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

4న వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం

నిజామాబాద్‌అర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహిస్తున్నట్లు డీఈవో దుర్గాప్రసద్ ఒక ప్రకటనలో తెలిపారు. టీఎన్జీవో భవన్‌లో జరిగే ఈ సమావేశానికి అన్ని యాజమాన్య పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

పాఠశాల తనిఖీ



బాల్కొండ: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం మెండోరా మండలం పోచంపాడ్ కూడలీ వద్ద గల బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆయన తనిఖీ చేశారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు మెను ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. బాలుర, బాలికల పాఠశాలల ప్రిన్సిపాళ్లు తారాసింగ్, చంద్రశేఖర్ ఉన్నారు.

నేటి నుంచి 'తొలిమెట్టు' శిక్షణ

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో తొలిమెట్టు కార్యక్రమానికి సంబంధించి మండల స్థాయి శిక్షణ కార్యక్రమాలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. విద్యార్థుల్లో గుణాత్మకమైన విద్యను పెంపొందించేందుకు ఈ ఏడాది కూడా తొలిమెట్టు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇదివరకే రాష్ట్ర, జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలు పూర్తి అయ్యాయని, మండల స్థాయి శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమం ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఈసెట్ కౌన్సెలింగ్

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఈసెట్ కౌన్సెలింగ్ కొనసాగింది. స్లాట్ బుక్ చేసుకున్న 320 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. బుధవారంతో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ముగుస్తుందని కౌన్సెలింగ్ కన్వీనర్ శ్రీరామ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఏఎన్ఎంలకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో

నిజామాబాద్ సిటీ: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఇటీవల నియమితులైన ఏఎన్ఎంలకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం సుదర్శనం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తగా చేరిన 74 మంది ఏఎన్ఎంలకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ 2017లో జిల్లాలో ప్రతి సబ్‌సెంటర్‌కు 225, అర్బన్‌లో 35 ట్యాబ్‌లను ఇచ్చామని చెప్పారు. అవి పాతవి కావటంతో తిరిగి తెప్పించుకుని కొత్తవి అందజేస్తున్నట్లు తెలిపారు. కొత్త ట్యాబ్‌లలో కేంద్ర, రాష్ట్రాలకు చెందిన పోర్టల్లను నమోదు చేయాలని, నమోదు కార్యక్రమానికి సంబంధించి ఏఎన్ఎంలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. పీడీఎం నారాయణ, సూపర్‌వైజర్లు సురేష్, మధుకర్, నాగరాజ్, వెంకటేష్, రాజేందర్ పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో రెండు గేదెలు మృతి



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం పాంగ్రా ఎస్ఆర్ కళాశాల వద్ద మంగళవారం తెగిపడిన విద్యుత్ వైరు తగిలి రెండు గేదెలు మృతి చెందాయి. బోర్గాం(పి) గ్రామానికి చెందిన నగేశ్, జీవన్‌కు చెందిన గేదెలు ఎస్ఆర్ కళాశాల వద్ద మేతకు వెళ్లాయి. ఆ సమయంలో అక్కడ తెగిపడిన విద్యుత్ వైరు ఉండటంతో గేదెలు మృతి చెందాయి. విద్యుత్‌శాఖ సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు.

జిల్లా మలేరియా కార్యాలయం మార్పు

నిజామాబాద్ సిటీ: జిల్లా మలేరియా కార్యాలయాన్ని నగరంలోని గౌతంనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి మార్చారు. మలేరియా ఆఫీస్ జిల్లా కేంద్రంలోని ఫైర్ స్టేషన్ ఎదుట ఉండగా, ఆ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే స్థితిలో ఉంది. దీనిని గ్రహించిన అధికారులు విషయాన్ని డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లగా గౌతంనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో గల మందుల స్టోరేజీ గదిను కేటాయించారు.

అక్రమ వెంచర్లపై ఆందోళన

- బాన్సువాడలో ధర్నా చేసిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు



ధర్నా చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు

బాన్సువాడ: పట్టణంలో అక్రమంగా వెలుస్తున్న వెంచర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, బీజేపీ నేతలు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కొత్తకొండ భాస్కర్ మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. పట్టణంలోని సర్వే నంబర్ 288/1, 288/2 లలో దర్గాకు కేటాయించిన స్థలంలో వెంచర్ ఏర్పాటు చేశారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్‌చేశారు. మున్సిపల్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సమయంలో బీఆర్ఎస్ నేతలు కల్పించుకుని కాంగ్రెస్, బీజేపీ కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మూడు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి వారికి సర్దిచెప్పారు. ఆందోళనలో కాంగ్రెస్ నాయకులు ఖలేక్, మంత్రి గణేశ్, మధుసూదన్‌రెడ్డి, బీజేపీ నాయకులు చీదరి సాయిలు, శ్రీనివాస్, పైడిమల్ లక్ష్మీనారాయణ, గంగారెడ్డి, సాయిబాబా పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్‌రెడ్డి(ఫైల్)

తాడ్వాయి: పెళ్లి కావడం లేదని మనస్తాపంతో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడ్వాయిలో చోటు చేసుకొంది. ఎస్సై ఆంజనేయులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జౌడి శ్రీకాంత్‌రెడ్డి (26)కి రెండేళ్ల క్రితం పెళ్లి నిశ్చయమై, రద్దయింది. అప్పటి నుంచి పెళ్లి సంబంధాలు రావడం లేదు. తనకు పెళ్లి అవుతుందో, లేదనని బాధపడుతుండే వాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన శ్రీకాంత్‌రెడ్డి సోమవారం తాడ్వాయి శివారులోని తన వ్యవసాయం పొలం వద్దకు వెళ్లి, అక్కడ ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం అటువైపు వెళ్లిన వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి బాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. గతంలో శ్రీకాంత్‌రెడ్డి తల్లి అనారోగ్యంతో మృతి చెందగా ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో తండ్రి బాల్‌రెడ్డి రోదనలు మిన్నంటాయి.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీ

వర్ని(మోస్రా): మోస్రాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి దొంగలు కాపర్ వైర్, ఆయిల్ చోరీ చేసినట్లు వర్ని ఎస్సై కృష్ణ తెలిపారు. 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రూ.15 విలువ గల రాగి తీగ, ఆయిల్ ఎత్తుకెళ్లారని చెప్పారు. విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్ ఓం ప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అదుపు తప్పిన వాహనం



రెంజల్: మండలంలోని దండిగుట్ట–కల్యాపూర్ గ్రామాల మధ్య మంగళవారం ఓ ఐచర్ వాహనం అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. మండలంలోని సాటాపూర్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న వాహనం దండిగుట్ట వద్ద కల్వర్టును ఢీకొంది. అనంతరం రోడ్డుకు అవతలి పక్క ఉన్న చెట్టును ఢీకొని ఆగిపోయింది. ఈ ప్రమాదంలో ఐచర్ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

బాల్కొండలో దొంగల హల్‌చల్



చోరీ జరిగిన సెల్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో సోమవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. రెండు మొబైల్ దుకాణాలు, ఓ మెడికల్ షాపులో చోరీకి పాల్పడ్డారు. పాత జాతీయ రహదారి 44కు ఆనుకుని ఉన్న షాపుల్లోనే చోరీ జరిగింది. దుండగులు రాత్రి 11.30 గంటలకు సిద్దార్థ సెల్‌పాయింట్‌లో చోరీకి పాల్పడ్డట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. ఆ దుకాణంలో పది కొత్త ఫోన్లు, మరో పది వరకు రిపేర్ కోసం వచ్చిన ఫోన్లు, రూ.40 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. మెడ్‌ప్లస్ మెడికల్ షాపు పక్కన గల మరో సెల్ పాయింట్‌లో చోరీకి యత్నించారు. కాని అందులో ఏమి దొరకలేదు. వన్నెల్(బి)చౌరస్తా వద్దగల మద్దుల గంగారాం కాంప్లెక్స్ మెడికల్ షాపులో చోరీకి పాల్పడి, ఒక లాప్‌ట్యాప్, 12 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి, ఏఎస్సై శంకర్ చోరీ జరిగిన దుకాణాలను పరిశీలించారు. ఆ పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రాలు సేకరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి



భుక్యా గణేశ్ (ఫైల్)

రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేట బిన్నీ రైస్ మిల్లులో ఆపరేటర్‌గా పని చేసే బుక్యా గణేశ్ కరెంట్ షాక్‌తో సోమవారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాలు.. నడుమి తండాకు చెందిన భుక్యా గణేష్(35) రెడ్డిపేటలోని బిన్నీ రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం రైస్‌మిల్లు యజమాని నర్సాగౌడ్ వ్యవసాయ భూమి వద్ద నుంచి టాటా ఏస్ వాహనాన్ని తీసుకు రావడానికి వెళ్లాడు. వాహనంలో గడ్డిమోపులు తీసుకొని వస్తుండగా మార్గమధ్యలో వాహనం బురదలో ఇరుకుపోయింది. గణేశ్ కిందకు దిగి టైర్ కింద రాడ్ వేసి పైకి లేపే క్రమంలో అక్కడే ఉన్న వ్యవసాయ మోటార్‌కు వెళ్లే కరెంటు తీగ తాకి షాక్‌తో పడిపోయాడు. ఆయనను వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మోటారు తీసుకొని వస్తూ.. నీట మునిగి ఒకరు

బోధన్‌రూరల్: బోధన్ మండలం కల్దుర్కి సిద్దాపూర్ శివారులో గల మంజీర నదిలో కల్దుర్కి గ్రామానికి చెందిన సాయిలు(58) పడి మృతి చెందాడు. మోటార్ మెకానిక్‌గా జీవనం సాగించే సాయిలు ఓ రైతు మోటార్‌ను నదిలో నుంచి మరమ్మతుల కోసం ఒడ్డుకు తెస్తుండగా నీటిలో పడి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగానాథ్ తెలిపారు.

ఇద్దరి రిమాండ్

మోపాల్: మండలంలోని మంచిప్పలో వివాహిత ఆత్మహత్య కేసులో ఇద్దరిని రిమాండ్ చేసినట్లు ఎస్సై రాము మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన సాయికుమార్, మౌనిక (25) దంపతులు. కుటుంబ కలహాలతో ఇటీవల మౌనిక ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు మౌనిక అత్త నవనీత, భర్త సాయికుమార్‌పై కేసు నమోదు చేసి, వారిని రిమాండ్‌కు తరలించారు.

తల్లిదండ్రుల చెంతకు విద్యార్థి

బోధన్: పట్టణ శివారులోని ఎస్సీ గురుకుల పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి శశాంక్ మంగళవారం అదృశ్యమైనట్లు ప్రిన్సిపాల్ పూర్ణ చందర్ రావు తెలిపారు. విద్యార్థి కుటుంబీకులకు సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు. సదరు విద్యార్థి గతంలో పాఠశాల నుంచి పారిపోయాడన్నారు. టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. కాగా ఆ విద్యార్థి దొరకడంతో పోలీసుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

నగరంలో వివాహిత..

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత బుర్కాలో అదృశ్యమైంది. గ్రూప్ పరీక్ష కోసం వచ్చిన ఇందల్వాయికి చెందిన సదరు యువతి మరో వ్యక్తితో కలిసి బుర్కాలో వెళ్లినట్లు సీసీ ఫుటేజీలో రికార్డయింది. దీనిపై గతంలోనే కేసు నమోదు కాగా.. మంగళవారం హిందు సంఘాల నాయకులు ఠాణాకు వెళ్లి ఈ కేసు గురించి ఆరా తీశారు. పెళ్లి అయి రెండు నెలలు అవుతుందని, పరీక్ష నిమిత్తం తీసుకు వచ్చానని ఆమె భర్త శ్రీకాంత్ తెలిపారు.

ఒకరిపై ఫోర్జరీ కేసు

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ రమేశ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన అశోక్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడ–బోర్లం రోడ్డులో అశోక్ రేకుల షెడ్డును నిర్మించాడు. షెడ్డుకు కరెంటు మీటర్ కోసం దరఖాస్తు ఫామ్‌పై కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేశాడని సీఐ పేర్కొన్నారు. కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.